www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 18 సెప్టెంబరు 2023
5
ఏలూరు



నేడు స్పందన రద్దు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని వినాయక చవితి సందర్భంగా 18వ తేదీన రద్దు చేస్తున్నట్లు ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఉత్సాహంగా పండుగను చేసుకోవాలన్నారు. అలాగే చవితి మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడొద్దని యువతకు సూచించారు. మద్యం సేవించడం, అల్లరి చిల్లర పనులు చేయడం, పెద్దగా లౌడ్ స్పీకర్లను వినియోగించడం వంటి వాటిని నిషేధించామని ఆమె తెలిపారు. సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని వినాయక చవితి పండుగ నేపథ్యంలో రద్దు చేసినట్లు తెలిపారు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదు చేసేందుకు వచ్చేవారు వచ్చే సోమవారం జరిగే స్పందనలో తమ ఫిర్యాదులను అందించాలని ప్రకటనలో తెలిపారు.

ఏం కొనేటట్టు.. తినేటట్టు.. లేదు

వినాయక చవితికి ధరాఘాతం
చుక్కల్లో నిత్యావసరాల ధరలు
పిండి వంటలకు రూ.వేలల్లో ఖర్చు
కానరాని పండుగ సందడి



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధరల పెరుగుదల సామాన్య ప్రజానీకాన్ని పండుగలకు సైతం దూరంచేస్తోంది. పండుగ రోజున కూడా పిండివంట చేయాలన్నా, సందడిగా పండుగ చేసుకోవాలన్నా భయపడాల్సి వస్తోంది. మోడీసర్కార్ వచ్చాక వంటనూనె, కందిపప్పు, మినపప్పు ఇలా అన్ని నిత్యావసర ధరలతోపాటు, వంటగ్యాస్ ధర సైతం పెరిగిపోవడం, పన్నుల భారాలు మోపడంతో సామాన్య ప్రజానీకం పండుగలకు సైతం పిండివంటలు చేసుకోలేని దుస్థితి నెలకొంది. దీంతో ఒకప్పుడు ఎంతో ఆర్భాటంగా జరిగే వినాయకచవితి పండుగ సైతం జిల్లాలో సందడిలేకుండా పోయింది. ధరల పెరుగుదలతో సామాన్యుల ఇళ్లల్లో పండుగ సందడి లేక వెలవెలబోతున్నాయి.

మోడీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సామాన్యుల జీవనం భారంగా మారింది. రోజు గడవడమే కష్టంగా తయారైంది. కరోనా తర్వాత ఉపాధి దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులు ఒకవైపు, రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు మరోవైపు జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గతంలో వినాయక చవితిని ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లాలో ఘనంగా నిర్వహించేవారు. సామాన్య ప్రజానీకం సైతం వివాహమైన కుమార్తెలను, అల్లుళ్లను, దగ్గర బంధువులను ఇంటికి పిలిచి ఎంతో సందడిగా పండుగను నిర్వహించుకునేవారు. పండుగ రోజు నాలుగైదు రకాల పిండివంటలు చేసుకుని, ఉండ్రాళ్లు వంటివి చేసి పూజలు చేసుకుని సంతోషంగా గడిపేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితిలేదు. వినాయక చవితి పండుగకు జిల్లాలో పెద్దగా కనిపించడం లేదు. అందుకు ప్రధానకారణం పెరిగిన ధరలే. ప్రజలపై మోపుతున్న వివిధ రకాల భారాలే. ప్రస్తుత మార్కెట్లో నిత్యావసర ధరలు మండిపోతున్నాయి. వంటనూనె కిలో ప్యాకెట్ రూ.120 నుంచి రూ.160 వరకూ ఉంది. మినపప్పు కిలో రూ.125 పలుకుతుండగా, పెసరపప్పు కిలో రూ.131, వేరుశనగ గుళ్ల కిలో రూ.160, బెల్లం కిలో రూ.60 వరకూ ఉన్నాయి. వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.980 ఉంది. కట్టెల పొయ్యిపైన వంటచేసే పరిస్థితి ఎక్కడా లేకుండా పోయింది. ఏది చేయాలన్న వంటగ్యాస్‌తోనే చేయాలి. రెండు, మూడు రకాల పిండివంటలు చేయాలంటే వంటగ్యాస్ పెద్దఎత్తున ఖర్చవుతుంది. నెలంతా రావాల్సిన గ్యాస్ సిలిండర్ పిండివంటలకు ఉపయోగిస్తే వారంరోజుల్లోనే అయిపోయే పరిస్థితి ఉంటుంది. వినాయక చవితిరోజు పులిహోర, పొంగలి, గారెలు, బూరెలు వంటి పిండివంటలు చేయాలంటే వంటనూనె నుంచి అన్ని సరులకులు అవసరం. వీటి ధరలు భారీగా పెరిగాయి. ఏదైనా ఒక పిండివంట చేయాలన్న రూ.రెండు వేలు వరకూ ఖర్చవుతుంది. రెండు, మూడురకాలు చేయాలంటే పెద్దఎత్తున ఖర్చుపెట్టాల్సి ఉంది. రోజంతా కష్టపడి పనిచేస్తే రూ.400 నుంచి రూ.500 కూలి రావడమే గగనంగా మారింది. నెలలో సగం రోజులు పనిదొరికితే గొప్పఅన్నట్లు పరిస్థితి ఉంది. కరెంటు బిల్లులు, పెట్రోల్ ధరలు, చెత్తపన్ను, నీటిపన్ను, జిఎస్‌టి ఇలా అనేక రకాల భారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపాయి. వీటికి తోడు నిత్యావసర ధరలు అందనంత ఎత్తుకు చేరాయి. దీంతో సామాన్య కుటుంబాల జీవనం భారంగా మారింది. దీంతో పండుగ చేసుకోవాలంటే భయపడుతున్నారు. ఇవేకాకుండా వినాయ ప్రతిమ, పూజకు ఉపయోగించే పత్రిసైతం సొమ్ములు చెల్లించి కొనుగోలు చేయాల్సిన వస్తుంది. ఇవన్నీ సామాన్యులకు పెనుభారంగా మారాయి. దీంతో ఒకప్పుడు ఎంతోఉత్సాహంగా జరిగే వినాయక చవితి వంటి పండుగ సైతం ప్రస్తుతం సందడి లేకుండా పోయింది. వినాయకచవితి మాత్రమే కాదు సంక్రాంతి, దీపావళి, దసరా వంటి పండుగలకు సైతం సామాన్య ప్రజానీకం దూరంగా ఉండాల్సిన దుస్థితి దాపురించింది. ప్రజలంతా ముక్తకంఠంతో ఉద్యమించినప్పుడు మాత్రమే ప్రభుత్వాలు దిగొస్తాయి. లేకపోతే సామాన్యుల బతుకులు రోజురోజుకు మరింత దుర్భరంగా మారే పరిస్థితి ఏర్పడనుంది.



అభివాదం చేస్తున్న నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ

వామపక్షాల ఆధ్వర్యాన ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏలూరులో రౌండ్ టేబుల్ సమావేశం, 25వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలు తెలిపాయి. ఆదివారం సాయంత్రం సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆఫీసులో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం, బిజెపి ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ 2020 సవరణ చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. దీనివల్ల 2014 నుండి వచ్చిన విద్యుత్ లోటును ఇప్పుడు ఛార్జీల పెంచి వసూలు చేస్తున్నారని విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, సర్ ఛార్జీలు, అదనపు ఛార్జీలు రకరకాల పేర్లతో ప్రజలపై రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల భారం వేశారని దుయ్యబట్టారు. గత నాలుగేళ్లలో ఎనిమిదిసార్లు వైసిపి ప్రభుత్వం కరెంటు ఛార్జీలు పెంచిందని విమర్శించారు. దీంతోపాటు పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు ప్రజలకు మోయలేని భారంగా ఉన్నాయన్నారు. తక్షణం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేయనున్నట్లు వారు తెలిపారు. దానిలో భాగంగా ఈనెల 22వ తేదీన ఏలూరు సిపిఎం కార్యాలయంలో రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానీకమంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, సిపిఎం, ఏలూరు కార్యదర్శి పళ్లెం కిషోర్, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎ.ఫ్రాన్సిస్

'అసైన్డ్' చట్టసవరణ దుర్మార్గం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం.

వైసిపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికులు, దళితులు, సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని, 9/77 చట్టాన్ని సవరణకు జిఒ జారీ చేయడం దుర్మార్గ చర్య అని దీన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కెవి.రమణ, మాల మహానాడు నాయకులు తొర్లపాటి శ్రీనివాస్, బిఎస్‌పి నాయకులు బి.రాజకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో దళిత సామాజిక న్యాయం కోసం వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం, రమణ, శ్రీనివాస్, రాజకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో 22 రకాల ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి సంక్షేమ పథకాల పేరుతో వైసిపి లబ్ధి కోసం ఉపయోగించుకోవడం దుర్మార్గమన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో లేనివిధంగా పేదల భూములను అక్రమంగా లాక్కుని ఇళ్ల స్థలాలకు కేటాయించడం అన్యాయమన్నారు. నూతన విద్యా విధానం, అధిక పన్నులు, నిరంతరం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతున్నాయన్నారు. మద్యపాన నిషేధం వంటి వాగ్దానాలతో గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం ప్రజలపై భారాలను మోపడం నీచమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనేరు రంగారావు సిఫార్సుల మేరకు రాష్ట్రంలో భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 18 రకాల ప్రభుత్వ భూములు 60 లక్షల ఎకరాలున్నాయని ఈ భూములు పేదలకు పంచాలని నిరంతర పోరాటాలు చేస్తున్నా నేటికీ ఆ భూములు భూస్వాముల ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ఆ భూములను పేదలకు పంచితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అలాగే జస్టిస్ పున్నయ్య దళితుల కోసం కొన్ని చట్టాలు సిఫార్సులు చేశారని ఆ సిఫార్సులు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21 నుండి 24వ తేదీ వరకూ జరగనున్న యాత్రలు సామాజిక న్యాయానికి దళిత రక్షణ యాత్ర జయప్రదం చేయాలని కోరారు. ఈ యాత్రకు ప్రజాసంఘాలు, దళిత సంఘాలు పేదల అభివృద్ధిని కోరుకునే ప్రజాస్వామ్య వాదులంతా మద్దతు తెలిపి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ప్రభాకర్‌రావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, బిఎస్‌పి జిల్లా నాయకులు కె.రాజ్ కుమార్, కె.సుబ్బారావు, సిహెచ్.లక్ష్మీనారాయణ, శేషవరపు మహంకాళి, మంగరాజు, బి.నాని, కె.సునీల్ పాల్గొన్నారు.




రిటైర్డ్ ఉపాధ్యాయుల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రిటైర్డ్ ఉపాధ్యాయుల నూతన కమిటీని ఆదివారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ వింగ్ సమావేశం షేక్ ముస్తఫా అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హాజరయ్యారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు రిటైర్మెంట్ తర్వాత వారు చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు, సంఘ కార్యక్రమాలను విశ్లేషించి వాటిని సంఘటితం చేసేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. పలు ప్రాంతాల రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎం.లక్ష్మీనారాయణ, జి.అదృష్టకుమార్, బి.గంగరాజు, ఎంవి.రంగాచార్యులు, నిర్మల కుమారి, కె.రంగారావు, ఎస్ఎస్.బాజీ, సత్యవాణితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఈ కమిటీ ద్వారా భవిష్యత్తులో రిటైర్డ్ ఉపాధ్యాయుల అవసరాలు, ప్రభుత్వం నుంచి రాబోయే పలు అంశాలపై చర్చించేందుకు, సహాయం చేయడానికి ఈ పెన్షనర్స్ వింగ్ తోడ్పాటు అందిస్తుందన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు వారి ఆలోచనలను ఈ సందర్భంగా సమావేశంలో వ్యక్తపరిచారు. ఈ కమిటీ ద్వారా రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యలు కమిటీ ముందు చర్చించి వీటిని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా, రాష్ట్ర సంఘాల ద్వారా అమలుపరచుకోడానికి వారి సహకారాన్ని తీసుకుంటుందని ఈ సందర్భంగా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ అన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్.కస్తూరి రావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు మండలాల నుంచి రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శి బి.అనురాధ, ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు, మండల అధ్యక్షులు రమణ, సిపిఎస్ డివిజన్ కన్వీనర్ లక్ష్మీనారాయణ హాజరయ్యారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు


ప్రజాశక్తి - ముదినేపల్లి



ముదినేపల్లిలో..

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండలంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ముదినేపల్లి పార్టీ కార్యాలయంవద్ద, మండలంలోని పెదపాలపర్రు గ్రామంలో రిలే నిరహార దీక్షలు కొనసాగాయి. ఆదివారం నియోజవర్గంలోని పలు క్రైస్తవ సంఘాల పాస్టర్లు నిరాహార దీక్ష శిబిరాలను సందర్శించి తమ సంఘీభావం తెలిపారు. కొడాలి వినోద్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. పార్టీ మండలఅధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, పెదపాలపర్రు సర్పంచి గంటా రాకేష్‌కుమార్, దావు నాగరాజు, బొంగు రవికుమార్, ఈడే సుధాకర్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కొయ్యలగూడెంలో చేపట్టిన నిరాహార దీక్ష కొనసాగింది. ఈ దీక్షకు టిడిపి పోలవరం నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న చంద్రబాబుకు 'బాబుతోనే మేము' అని పోస్ట్ కార్డ్‌పై రాసి జైలు అడ్రస్‌కి పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో బొరగం మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్ పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందన్నారు. ఒకవైపు చంద్రబాబు భవిష్యత్తు గ్యారెంటీ పర్యటనలు మరోవైపు నారా లోకేష్ యువగళం పాదయాత్ర దెబ్బకు బెంబేలెత్తి జగన్ ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. చంద్రబాబు అక్రమ కేసులు పెట్టి, జగన్ రెడ్డి సైకోలా వ్యవహరించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఎం.సోంబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కాకర్ల సురేష్, రైతు కార్యదర్శి గద్దె అబ్బులు, ఆలపాటి ఫణికిషోర్, రాష్ట్ర ఎస్‌సి సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు, నల్లూరి కృష్ణమోహన్, డి.కృష్ణమోహన్, కుందుల శ్రీను, ప్రసాద్, పి.రాంబాబు, నాగబాబు, సూర్యచంద్ర, సుంకర వెంకట్రావు, తెల్లం జయపాల్, కుంజం గంగుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో..

టి.నరసాపురం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తిరుమలదేవిపేట పంచాయతీలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

మండవల్లి : చంద్రబాబు ప్రజాస్వామికమని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చాబత్తిన విజయ్ అన్నారు. చంద్రబాబు అరెస్టుపై ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమ కోసం అహర్నిశలు పరితపించే మనిషి చంద్రబాబు అని అన్నారు. వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమన్నారు.



జెపి సెంటర్‌లో ట్రాఫిక్‌లో ఇరుకున్న వాహనదారులు

జెపి సెంటర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో స్థానిక జెపి సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఆదివారం సాయంత్రం వినాయక చవితి ఉత్సవ విగ్రహాలు, పూజా సామాగ్రి వస్తువులు రోడ్లపై అమ్మకానికి సిద్ధం చేశారు. ఈ క్రమంలో సాయంత్రం పూట అధిక సంఖ్యలో కొనుగోలుదారులు రావడంతో వాహనాల రద్దీ పెరిగింది. విగ్రహాలను తరలించేందుకు వచ్చిన ట్రాక్టర్లు, పూజా సామాగ్రి కొనుగోలు చేసే వాహనాలతో జెపి సెంటర్ కిక్కిరిసిపోయింది. ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ ట్రాఫిక్ నియంత్రించడంలో పోలీస్ సిబ్బంది విఫలమయ్యారని పలువురు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కల్వర్టు గోడను ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పోలవరం

గోపాలపురం గ్రామ శివారు దేవరపల్లి రోడ్డులో పొగాకు బోర్డు దగ్గరలో సత్యనారాయణ అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై అతివేగంగా వెళుతుండగా అదుపుతప్పి రోడ్డు ప్రక్కన గల కల్వర్టు గోడను ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామానికి చెందిన కట్టవ సత్యనారాయణ దేవరపల్లి మండలం చిక్కాల గ్రామం వారి కూతురి ఇంటి వద్ద నుంచి వారి గ్రామానికి బయలుదేరి వస్తూ ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుని కుమారుడు కట్టవ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు గోపాలపురం ఎస్ఐ కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్‌తోనే ఐక్య పోరాటాలు

జంగారెడ్డిగూడెం: ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) స్థాపించిన తర్వాతనే ఐక్య పోరాటాలు జరిగాయని ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్షులు కెఎస్.నారాయణ అన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ఏర్పడి 45 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద జెండా ఆదివారం ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఇటీవల వరకూ రెండు ప్రధాన సంఘాలు కార్మికుల సమస్యలు పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సందర్భంలో ఐక్య పోరాటాల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని మూడో సంఘం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ స్థాపించిందని తెలిపారు. ఫెడరేషన్ సభ్యత్వాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రెండు పెద్ద కార్మిక సంఘాలకు గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈ విధంగా సభ్యత్వాలను బట్టి గుర్తింపు ఇవ్వడం ఎన్నడూ లేదన్నారు. ఎన్నికల ద్వారానే గుర్తింపు సంఘం కార్మిక వర్గాలు గుర్తించే వారని, ఈసారి అవి లేకుండా సభ్యత్వం ద్వారా గుర్తింపుని ఇవ్వడం అన్యాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రటరీ జిఎస్.నారాయణ, కోశాధికారి ఎం.విజయశ్రీ, కమిటీ సభ్యులు ఎం.అజయ్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాని, ఎపి పట్టణ పౌర సమాఖ్య పట్టణ కార్యదర్శి వంగా గోపి, డివైఎఫ్ఐ నాయకులు పి.ప్రసాద్, సిఐటియు, నాయకులు పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్ తొలగింపు

మంత్రి చొరవతో మంచి బియ్యం అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

పౌర సరఫరా శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఎండియు ఆపరేటర్ మురళీను తొలగించాల్సిందిగా సిఫార్సు చేశారు. లింగపాలెం మండలంలోని రంగాపురం గ్రామంలో ఆదివారం ఎండియు ఆపరేటర్ బియ్యం పంపిణీ చేయు సమయంలో కార్డుదారుడైన పుప్పాల వెంకటేశ్వరరావు బియ్యంలో ముక్కుపురుగులు, తెల్ల పురుగులు వస్తున్నాయని సదరు ఎండియు ఆపరేటర్ మురళీను బియ్యంను మార్చి ఇవ్వమని అడిగారు. బియ్యం మార్చకపోగా, సమాధానం సరిగ్గా చెప్పక పోవడంతో ఈ విషయం ప్రచారమాధ్యమాల్లో పెట్టారు. ఈ విషయం తెలిసిన వెంటనే పౌర సరఫరా శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కార్డుదారుడైన పుప్పాల వెంకటేశ్వరరావుకు మంచి బియ్యంను మార్చి అందజేశారు. సదరు ఎండియు ఆపరేటర్ మురళీను తొలగించాల్సిందిగా సిఫార్సు చేశారు. కారుమూరి నాగేశ్వరరావు వెంటనే స్పందించి ఎక్కడైనా తప్పు జరిగితే సంబంధిత వారు ఎవరైనా, అధికారులైనా క్షమించేది లేదని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - భీమడోలు



పోలింగ్ బూత్ తనిఖీ చేస్తున్న ఏలూరు ఆర్‌డిఒ

ఏలూరు ఆర్‌డిఒ నరసాపురం ఎస్‌కె.ఖాజావలి ఆదివారం కురెళ్లగూడెంలోని రెండు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, వివిధ అంశాలను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు, తాగునీరు, ప్రహరీ గోడ, మొబైల్, ఇంటర్‌నెట్ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఇప్పటికే నిర్వహించిన ఓటర్ల నమోదు కార్యక్రమంపై రాండం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటికే గుర్తించి సరి చేసిన గ్రామ పరిధిలో ఇంటి నెంబర్ లేని పది నివాస గృహాలకు చెందిన ఓటర్లు, పదికిమించి ఓటర్లు ఉన్న ఆరు నివాసాలు, నూతనంగా నమోదైన 15 మంది ఓటర్లు వివరాలను తనిఖీ చేశారు. వాటన్నింటినీ నిబంధనల మేరకు ఇప్పటికే సరిచేసినట్లు భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ ఆర్‌డిఒ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్, విఆర్ఒ షేక్ ఇంతియాఫ్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



ఇంటింటి సర్వేలో ఆర్‌డిఒ ఝాన్సీరాణి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి తెలిపారు. ఆదివారం జీలుగుమిల్లి పంచాయతీలో నిర్వహిస్తున్న ఓటరు సవరణ జాబితా ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పోలింగ్ స్టేషన్ 107, 109 కేంద్రాల పరిధిలో ఒకే ఇంటి నెంబర్‌లతో వున్న ఓటర్ లిస్టులను పరిశీలించి, వెంటనే వాటిని సరిదిద్దాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఆమెతో పాటు తహశీల్దార్ సుందర్ సింగ్, బిఎల్ఒ లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎకు వినతి


ఎంఎల్‌ఎకు వినతిని అందజేస్తున్న రాంబాబు

కొయ్యలగూడెం:నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొయ్యలగూడెంలో షాపు ప్రారంభానికి విచ్చేసిన పోలవరం నియోజకవర్గం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు కలిసి వినతిని సమర్పించారు. భవన నిర్మాణ కార్మికుల చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, అసెంబ్లీలో మాట్లాడి సిఎం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. 30 లక్షల మంది కార్మికుల హక్కులు, చట్టాలను అమలు చేసి ఆదుకోవాలన్నారు. ఆయన స్పందిస్తూ అసెంబ్లీలో భవన నిర్మాణ కార్మికుల విషయంపై మాట్లాడి, సిఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

నేరాలు - ఘోరాలు

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని బత్తులవారి గూడెంలో కన్నతల్లి మందలించిందని కుమార్తె కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఇంటర్‌మీడియట్ చదువుతున్న విద్యార్థిని సొంగా ఎస్తేరు రాణి(17) తల్లి మందలించిందని కలుపు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలో వెళ్లడంతో నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలు షాపుల్లో చోరీ
రూ.21 వేల నగదు అపహరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నెంబర్ ప్లేట్‌లేని ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వరుస చోరీలకు పాల్పడుతున్న ఘటన నగరంలో చోటుచేసుకుంది. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు శ్రీరామ్‌నగర్ నాలుగో రోడ్డులోని శ్రీకమల జనరల్ స్టోర్స్‌ను కైలా కమల నిర్వహిస్తున్నారు. ఆమె ఈనెల 14వ తేదీన తాళాలు వేసి 15వ తేదీ ఉదయం చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. షాపులో రూ.21 వేల నగదు, ఇతర వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఇదే కాకుండా దుండగులు ఒకే రోజు పలు షాపుల్లో దొంగతనాలకు పాల్పడినట్లు సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించారు. దొండపాడు దత్తాత్రేయ ఆలయ సమీపంలోని ఒక షాపును పగులగొట్టి నగదు, వస్తువులను అపహరించుకుపోయారు. సీసీ పుటేజీలను పరిశీలించగా నెంబరు లేని పల్సర్ బైక్‌పై ముగ్గురు యువకులు ఆ ప్రాంతంలో తిరిగి చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. కైలా కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసు నమోదు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తన భార్యను కిడ్నాప్ చేసినట్లు భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బయ్యనగూడెనికి చెందిన మనెల్లి విజయ్‌కుమార్, లక్ష్మీపురానికి చెందిన సిహెచ్ సాయిశ్రీలు ప్రేమించుకుని, ఆగస్టు 2వ తేదీన అన్నవరం గుడిలో వివాహం చేసుకున్నారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 13వ తేదీన స్థానిక అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద విజయ్‌కుమార్, సాయిశ్రీలు ఉండగా, లక్ష్మీపురం గ్రామానికి చెందిన దమ్మాడి సమీర్ యాదవ్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించడంతో పాటు, సాయిశ్రీని కిడ్నాప్ చేశాడన్నారు. అలాగే చంపుతానని బెదిరించాడని, ఈమేరకు విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని యనమదల గ్రామంలో భార్య వేధింపులు తట్టుకోలేక భర్త నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు భరత్(36) తెలిపిన వివరాల ప్రకారం పుట్టుకతో అంధుడైనందున పదేళ్ల క్రితమే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని, తన భార్య మోసగించి వేరొకరితో వెళ్లి నెల రోజులు క్రితం తిరిగి వచ్చిందన్నారు. తిరిగి వచ్చినప్పటి నుంచి తనని వేధిస్తుందన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి చేశానని బాధితుడు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు టన్నుల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పరిధిలోని సిలివ గట్టు సమీపంలో ఉన్న రహస్య స్థావరంలో వాసు అనే వ్యక్తి అక్రమంగా ఆరు టన్నుల రేషన్ బియ్యం నిల్వ ఉంచటంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, సివిల్ సప్లై శాఖ అధికారులు దాడి చేసి సీజ్ చేశారు. నిందితునిపై 6A,7(1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు నూజివీడు పిడిఎస్ డిప్యూటీ తహశీల్దార్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

బాలుడికి పాము కాటు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పోసనపల్లి గ్రామంలో నిద్రిస్తున్న బాలుడు పొన్నం చైతన్య(7)ను కట్లపాము ఆదివారం కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు తెలిపారు. తీవ్ర భయాందోళనకు గురైన బాలుడిని వైద్యులు కౌన్సెలింగ్ నిర్వహించారు.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్‌వైరు

బుట్టాయగూడెం:మండలంలోని లక్ష్మమ్మగూడెం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో రోడ్డుపై అడ్డంగా విద్యుత్ వైర్ పడింది. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ తీగ రోడ్డుపై అడ్డంగా పడటంతో స్థానికులు రోడ్డుపై ప్రయాణం చేస్తున్న ప్రయాణికులను ఆపి, విద్యుత్ వైరు రోడ్డుపై పడి ఉంది చూసుకొని వెళ్లండి అని చెప్పారు. ఆ విద్యుత్ వైరుని కర్ర సహాయంతో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తీసారు.

బాలిక కిడ్నాప్

జంగారెడ్డి గూడెం:మండలంలోని తాడువాయి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన బాలిక కిడ్నాప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడువాయి హైస్కూల్‌లో చదువుతున్న బాలికను పూనెం సాయికిరణ్ ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్‌లో సంప్రదించగా స్పందించకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు బాలిక కిడ్నాప్ కేసు నమోదు చేశామని ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.

ఆటో అదుపు తప్పి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆటో అదుపు తప్పి తిరగబడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక వన్‌టౌన్ బావిశెట్టివారిపేటకు చెందిన కోలా దీపక్‌కుమార్(40) ఆటో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, పిల్లలున్నారు. దీపక్ కుమార్ ఆదివారం తన ఆటోలో పండ్ల లోడు వేసుకుని, కైకలూరు వెళుతుండగా మార్గమధ్యలో నగర శివారు శ్రీపర్రు వద్ద ఆటో అదుపు తప్పి ఒక్కసారిగా తిరగబడింది. ఈ ప్రమాదంలో దీపక్ కుమార్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతన్ని 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి
ఐదుగురు అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్:పేకాట శిబిరంపై ఏలూరు రూరల్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఏలూరు మండలం కొమడవోలులో కొందరు పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ బాబు ఆదివారం తన సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4,030 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు వేయండి మహాప్రభో..!

జలమయమైన గురజ రోడ్డు
పట్టించుకోని అధికారులు
రోడ్డుపైకి పొంగిపొర్లుతున్న డ్రెయినేజీ
వాహనదారులు, ప్రజలు ఇక్కట్లు


రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని గుడ్లవల్లేరు రోడ్డు(గురజరోడ్డు) అధ్వానంగా తయారైంది. రోడ్డు మలుపు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకూ కిలోమీటర్ మేర రోడ్డు గుంతలమయమై వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఈరోడ్డు వెంబడి పంచాయతీ డ్రెయినేజీ ఉంది. రోడ్డు కంటే డ్రెయినేజీ ఎత్తులో ఉండడం, రోడ్డు పల్లంగా ఉండడంతో వర్షం కురిస్తే డ్రెయినేజీలోని నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీంతో రోడ్డు జలమయమవుతుంది. వర్షం కురిస్తేచాలు రోడ్డు సంద్రంగా మారుతోంది. ముదినేపల్లిలోని డ్రెయినేజీలను కొందరు స్వార్థపరులు ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండగా, మరికొందరు డ్రెయిన్లను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపట్టారు. దీంతో డ్రెయినేజీలు కుంచించుకుపోయి మురుగునీరు పారుదలకు అడ్డంకిగా మారింది. నివాసితులు, వ్యాపారులు డ్రెయినేజీల్లో చెత్తాచెదారం వేయడంతో డ్రెయినేజీలు పూడికిపోయాయి. పంచాయతీ కార్మికుల చేత ఎన్నిసార్లు డ్రెయినేజీల్లోని పూడికలు తీసినా ప్రయోజనం లేకుండా పోతోంది. మళ్లీ వ్యాపారులు, నివాసితులు వ్యర్థాలను డ్రెయినేజీల్లో వేయడంతో మురుగునీరు పారుదల నిలిచిపోయి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి మురుగు నీరు పారుదల లేక ఇళ్లముందు, రోడ్లపై నిల్వ ఉంటుంది. దీంతో ఈ ప్రాంతవాసులు అనేక అవస్థలు పడుతున్నారు. నీరు నిల్వ కారణంగా దుర్వాసన రావడంతో పాటు, దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తున్నట్లు ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఈ రోడ్డులోనే ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, ఐటిఐ, పలు ప్రైవేటు పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, తదితర విద్యాసంస్థలు ఉన్నాయి. దీంతో నిత్యం వందలాది మంది విద్యార్థులు ఈ రోడ్డుపై నుంచే మురుగు నీటిలో నడచుకుంటూ విద్యాసంస్థలకు వెళ్తాంటారు. చిన్నపిల్లలు మురుగు నీటిలో దిగి నడచుకుంటూ వెళ్తుండడంతో పిల్లలకు దురదలు వస్తున్నట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నీరు నిలిచి ఉండడంతో విద్యార్థులకు, వాహనదారులకు దారి కనబడక గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో ప్రజలు పడుతున్న పాట్లు దృష్టిలో పెట్టుకొని ఈ రోడ్డును మరమ్మతులు చేయడంతో పాటు, రోడ్డుపైకి డ్రెయినేజీలోని నీరు ప్రవహించకుండా, డ్రెయినేజీ ఆక్రమణలను తొలగించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


చర్చల్లో యాజమాన్యం, ఉద్యోగులు, సిఐటియు నాయకులు

చర్చలు సఫలం..
వేతన బకాయిలు, ప్రయాణ ఛార్జీలు ఇచ్చేందుకు ఒప్పందం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జార్జ్ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ఆఫీస్‌లో కన్సల్టెంట్స్‌గా పనిచేస్తున్న వారికి వేతన బకాయిలు, ప్రయాణం ఛార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేయగా యాజమాన్యం కన్నాపురం ఇన్స్టిట్యూట్ ఆఫీసులో చర్చలు నిర్వహించింది. ఆగస్టు నెల జీతాలు, రెండు నెలలు ప్రయాణ ఛార్జీలను ఇస్తామని ఒప్పందం చేశారు. సంస్థ యాజమాన్యం తరుపున మేనేజర్ సిద్ధార్థ, సూపర్‌వైజర్లు సురేష్, దుర్గ, గిరిజన సంఘం సిఐటియు నాయకులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కరరావు, శుక్ల బోయిన రాంబాబు చర్చల్లో పాల్గొన్నారు.


మట్టి విగ్రహాలందజేస్తున్న జనసేన నాయకులు

జనసేన ఆధ్వర్యాన ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలో వినాయకచవితి సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో ఉచిత మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో ఈ మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టామని జనసేన నాయకులు అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయన్నారు. వాటిని వాడకుండా హిందువులంతా మట్టి విగ్రహాలనే వాడి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తరగళ్ల శ్రీను, చిలుకూరి ఫణి, రాజేష్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో చవితి సంబరాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రం పరిధిలోని గ్రామాలలో వినాయక చవితి సందడి మొదలైంది. గ్రామ, గ్రామానా మండపాలు వెలుస్తున్నాయి. మండపాలు అన్నీ సుందరీకరిస్తున్నారు. ఈ సందర్భంగా కన్నాయిగుడెం, పొంగుటూరు, గవరవరం, కొయ్యలగూడెం గ్రామాలకు చెందిన భక్తులను ప్రజాశక్తి పలకరించింది. ఈ సందర్భంగా భక్తులు పండగలు అనేవి మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అన్నారు. మన రాబోయే తరాలు కూడా పాటించేలా మనం తెలపాలని కోరారు.

సొసైటీ తరపున రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం సొసైటీ సభ్యులైన గోరిపర్తి లక్ష్మణస్వామి(52) ఇటీవల మరణించగా కెడిసిసిబి ఉత్తర్వులను అనుసరించి అతని కుటుంబసభ్యులు గోరిపత్తి లక్ష్మికి ఆదివారం సొసైటీ తరపున రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బడుగు రంగారావు, సిఇఒ నీలం నాగేశ్వరరావు, వైసిపి నాయకులు, దండు బోయిన రవి, గొల్లపల్లి నాగరాజు, వలి పాల్గొన్నారు.

వివాదాలకు తావులేకుండా ఉత్సవాలు చేసుకోవాలి


ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహిస్తున్న భీమడోలు ఎస్ఐ

ప్రజాశక్తి - భీమడోలు

వినాయక చవితి ఉత్సవ కమిటీలు వివాదాలకు తావివ్వకుండా కార్యక్రమాలను నిర్వహించుకోవాలని భీమడోలు ఎస్ఐ చావా సురేష్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక చవితి ఉత్సవ కమిటీలతో ఎస్ఐ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పందిళ్లను ట్రాఫిక్‌కు అంతరాయం లేని విధంగా వేసుకోవాలని కోరారు. ఇదేవిధంగా ఊరేగింపు సమయంలో సైతం ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తి, ప్రాణనష్టాలు జరగకుండా చూసేందుకు పందిళ్లలో విద్యుదీకరణ పనులను నిపుణులతో చేయించుకోవాలన్నారు. వినాయక చవితి పందిళ్ల వద్ద రాత్రి సమయంలో దొంగతనాలు జరగకుండా కాపలాను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో అసభ్యతకు, అశ్లీలతకు చోటు లేకుండా జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు. ఊరేగింపు సమయంలో నిర్వాహకులు సంయమనం పాటించాలని కోరారు. నిమజ్జనం సమయంలో ప్రమాదాల జరగకుండా జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అన్న సమారాధన సమయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు, సాంప్రదాయ రీతిలో కార్యక్రమాలను నిర్వహించుకోవాలని కోరారు.

పులిరామన్నగూడెం విఆర్‌ఒకు అస్వస్థత
సెలవు రోజుల్లోనూ పని ఒత్తిడి


చికిత్స తీసుకుంటున్న విఆర్‌ఒ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పులిరామన్నగూడెం విఆర్ఒ కోటం బాలరాజు అస్వస్థకు గురై కళ్లు తిరిగి పడిపోవడంతో తోటి సిబ్బంది ఆయనను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. బుట్టాయగూడెం మండలంలోని విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, తహశీల్దార్ కార్యాలయంలో ఇంటి నెంబర్లు సున్నా ఉన్న వాటి వివరాలు, సవరణలు, రానున్న ఎలక్షన్‌లు దృష్టిలో పెట్టుకొని ఓటరు జాబితాల వెరిఫికేషన్ విధులు నిర్వహిస్తూ ఉండగా పులిరామన్నగూడెం విఆర్ఒ అస్వస్థతకు గురయ్యారు. ఆ విధంగా పడిపోవడాన్ని చూసి తోటి సిబ్బంది ఆయన చనిపోయారేమోననే భయానికి గురయ్యారు. గత కొద్ది రోజులుగా విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బందిపై పని భారం, పని ఒత్తిడి ఎక్కువైనట్టు కనిపిస్తుంది. రెండవ శనివారం, కృష్ణాష్టమి, ఆదివారం వరుసగా సెలవులు రాగా విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది చేత ఇటువంటి సెలవు రోజులలో కూడా పని చేయించడం వలన అనారోగ్యంతో అస్వస్థతకు గురైన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఏజెన్సీ మండలం కావడంతో మారుమూల గ్రామాలలో సిగ్నల్ సమస్య ఉండడం వలన పనులు అనుకున్నంత సమయానికి జరగకపోవచ్చు. పైఉన్నతాధికారులు పని త్వరగా జరగాలని చెప్పడంతో, సెలవు రోజులలో కూడా పనిచేయడం వలన త్వరగా పని అయిపోవాలని, ఉన్నతాధికారుల ఒత్తిడితో అధికారులు అస్వస్థకు గురవుతున్నారని తెలుస్తుంది.

గణేష్ ఉత్సవాలకు యువత సన్నద్ధం
సందడిగా మారిన వై కూడలి


ఊరేగింపుగా తరలిస్తున్న గణేష్ విగ్రహం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో పూజలు అందుకునేందుకు గణనాధుని విగ్రహాలు వాహనాలపై గ్రామాలకు తరలి వెళుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఉత్సవాల కమిటీ నిర్వాహకులు వివిధ వాహనాల్లో ముదినేపల్లి చేరుకుని విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. గణేష్ విగ్రహాలను వివిధ వాహనాల్లో ఎక్కించి ఊరేగింపుగా తమ గ్రామాలకు తరలి వెళుతున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు డప్పు వాయిద్యాలతో, యువకుల నృత్యాలు, కేరింతల నడుమ ఊరేగింపుగా విగ్రహాలను గ్రామాలకు తీసుకు వెళుతున్నారు. దీంతో ముదినేపల్లి సెంటర్ కోలాహలంగా మారింది. అదేవిధంగా వైకూడలి వద్ద ఉత్సవపూజా సామాగ్రిని వ్యాపారులు జోరుగా విక్రయిస్తున్నారు. పెద్ద సంఖ్యలో రోడ్డు మార్జిన్లలో దుకాణాలు ఏర్పాటు చేసి పూజా సామాగ్రిని విక్రయిస్తుండడంతో పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి పూజా సామాగ్రిని కొనుగోలు చేసి, తమ వెంట తీసుకెళు తున్నారు. వివిధ గ్రామాల నుంచి యువతీ, యువకులు, చిన్నలు, పెద్దలు, ముదినేపల్లి సెంటర్ చేరుకుని విగ్రహాలను, పూజా సామాగ్రిని కొనుగోలు చేసి తీసుకెళ్లడంతో ముదినేపల్లి సెంటర్ సందడిగా మారింది.

ఉత్సవ మండపాలు పరిశీలన

కామవరపు కోట:వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే మండపాలను తడికలపూడి ఎస్ఐ జయబాబు ఆదివారం పరిశీలించారు. పండగ సమయంలో సంతోషంతో, ఉత్సాహంతో ముందుకు సాగాలన్నారు. పండుగ పేరిట శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని, ప్రతిఒక్కరు కూడా శాంతియుతంగా పండగను జరుపుకోవాలని ఆయన సూచించారు. మండపాల వద్ద అశ్లీల డాన్సులు, మతపరమైన గొడవలు కానీ సృష్టించకూడదని, ప్రతి మండపంపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. నిమజ్జన సమయాలలో చిన్నపిల్లలను దూరంగా ఉంచాలని తెలిపారు.

డ్రెయినేజీలు అస్తవ్యస్తం..!
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లిలో డ్రెయినేజీ నిర్మాణపనులు గ్రామస్తులు, వాహనదారుల పాలిట శాపంగా మారాయని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు టి.అప్పారావు విమర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మండవల్లిలో చేపట్టిన డ్రెయినేజీ పనులను గుత్తేదారుడు అస్తవ్యస్తంగా, ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నాడన్నారు. డ్రెయినేజీ నిర్మాణ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి హద్దులు లేకుండాపోయాయన్నారు. దీంతో మురుగు పారేందుకు అవకాశం లేక, మురుగు నీరు అంతా జాతీయ రహదారి పైకి చేరుకుని, దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. తాగునీటి పైపులైన్లు ధ్వంసం అయిపోయి, తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన పైపుల ద్వారా తాగునీరు, మురుగునీటితో కలిసిపోయి చెరువులను తలపిస్తుందన్నారు. అంతేకాకుండా మండవల్లి ప్రధాన సెంటర్ నుంచి కైకలూరు వరకు పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రయాణించలేక నానాఅవస్థలు పడుతున్నారు. రాత్రి వేళలో ఆ గుంతలు కనపడక వాహనదారులు గుంతల్లో పడిపోయి, ప్రమాదాలు బారిన పడుతున్నారన్నారు. అంతేకాకుండా నిర్మించిన డ్రెయినేజీ మధ్యలో ఖాళీలను ఉంచడంతో ఖాళీలు కనపడక, పశువులతో పాటు ప్రజలు ఆ ఖాళీ నుంచి డ్రెయినేలో పడి గాయాలపాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఇష్టానుసారంగా నిర్మిస్తున్న పనుల వల్ల మురుగునీరు పారేందుకు అవకాశం లేకపోవడంతో జాతీయ రహదారిపై నుంచి ప్రవహిస్తూ వెలమపేట రామాలయానికి వెళ్లే రహదారి ముంచేస్తుంది. దీంతో మండవల్లి ప్రధాన సెంటర్ వద్ద నుంచి కైకలూరు సందు వరకూ తీవ్ర స్థాయిలో దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాంట్రాక్టర్ పనులు నిర్వహించాల్సి ఉండగా, కాంట్రాక్టర్‌తో అధికారులు చేతులు కలిపి పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని ఆయన విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి, గుంతలను పూర్తిస్థాయిలో పూడ్పించాలన్నారు. ప్రయాణంలో ఇబ్బందులు కలగకుండా చూడాలని, మురుగునీరు పారేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కోశాధికారి ఎ.ప్రదీప్‌కుమార్, పొన్నూరు రామచంద్రరావు పాల్గొన్నారు.


వేలంపేట రామాలయాన్ని ముంచెత్తిన మురుగునీరు

పశువుల అక్రమ రవాణాపై కేసు

ప్రజాశక్తి - జంగారెడ్డి గూడెం

పశువులను అక్రమ రవాణా చేస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా స్థానిక ఏలూరు రోడ్డు గూడ్స్ లారీలో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా పశువులను రవాణా చేస్తున్న వాహనాన్ని గుర్తించామన్నారు. జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డ్ నుంచి తమిళనాడు కబేలాకు పశువులను తరలిస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. 9 ఎద్దులు, 41 దున్నపోతులను అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిపారు. రవాణా చేస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని తమిళనాడుకి చెందిన కె.చిన్నాదురై, లారీ ఓనర్ ఆర్.రామస్వామి, పశువుల రవాణాకు సహకరించిన వీరంకి గోపాలకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

విశ్వకర్మ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీకంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం వారు ప్రతి సంవత్సరం అక్టోబర్ 17వ తేదీన శ్రీవిశ్వకర్మ భగవాన్ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీకంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కులాలకు అతీతంగా శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతిని అందరూ జరుపుకోవాలన్నారు.

చాట్రాయి: మండలంలోని సోమవరం గ్రామంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహదేవ నాగాచారి, మహదేవ వెంకటచారి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. విశ్వ బ్రాహ్మణులకు గుర్తింపు వచ్చినటువంటి రోజున పురస్కరించుకొని ముందుగా పోతునూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి, వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ జెండాను ఆవిష్కరించారు. విశ్వబ్రాహ్మణులు గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం గ్రామంలోని వడ్రంగి మేస్త్రిల సంఘమైన శ్రీకనకదుర్గ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా సంఘ అధ్యక్షులు తుమ్మిరాడ పోసి బాబు అధ్యక్షతన పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పాల్గొన్నారు. విశ్వకర్మ భగవాన్ ఆలయానికి పూలమాలలు వేసి, పోలవరంలోని సంఘ సభ్యులు అందరూ కలిసి గ్రామంలో స్వామి విగ్రహాన్ని ఊరేగించి అనంతరం అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లింగోజి భాస్కరరావు, డి.శ్రీనివాస్, ఎల్.పోసిబాబు, టి.శ్రీనివాస్, కె.ఏడుకొండలు, ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 94/2022

1. శ్రీమతి యండపల్లి అరుణ -వాది

Vs

1. శ్రీ కుక్కల తిరుమల వెంకట శ్రీనివాస్ -ప్రతివాది

వాది పై నంబరు దావా బాకీ రాబట్టుకొనుటకు, ప్రతివాదిపై దాఖలు చేయటమైనది. ప్రతివాదికి పై నెంబరు దావాలో ఎన్ని పర్యాయములు కోర్టు వారి ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపుతున్నప్పటికి అందలి విషయములు తెలుసుకుని ఏదో కారణం చెప్పి కావాలని నోటీసులు తీసుకొనకుండా బుద్ధిపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు. కనుక శ్రీ కోర్టు వారు ప్రతివాదిపై అమలు జరగవలసిన నోటీసులు పేపరు ప్రకటన ద్వారా తెలియచేయుటకు వాదికి అనుమతి జారీ చేసినారు. కనుక ప్రతివాది, పై నంబరు O.S. No. 94/2022 దావాలో వ్యక్తిగతంగా గాని, న్యాయవాది ద్వారా గాని **ది. 28-11-2023వ సంవత్సరం తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై అభ్యంతరములు ఏమైనా ఉన్న ఎడల తెలియచేయవలెనని, లేని ఎడల ప్రతివాది పై పరోక్షముగా తదుపరి చర్యలు శ్రీ కోర్టు వారు జరిపించవలసి ఉండునని ఇందుమూలముగా ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

By Order dt. 15-09-2023

నిమ్మగడ్డ పుల్లారావు
న్యాయవాది, కొవ్వూరు

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSONS JUDGE :: WEST GODAVARI DISTRICT :: ELURU
I.A.No.1/2023 IN A.S.No. /2023
A.S.S.R.No.4982/2023

Between:
Sri. Kusuma Chaitanya Mohan
...Petitioner /Appellant
AND
Mrs. Shamla Begum and two others
...Respondents /Respondents

NOTICE

TO:
Respondent No.2:
Mrs. Shaik Sufia Begum, W/o Late Ismail Sharief, Aged about 60 years Occ: Housewife, R/o 18-2-28, Gun Bazar, Eluru, West Godavari District, A.P.
Respondent No.3:
Mrs. Nageena Begum @ Nageera Sultana, W/o Gatti Ramesh, Aged about 33 years Occ: Housewife, R/o 18-3-28, Gun Bazar, Eluru, West Godavari District, A.P.

The above numbered petition is filed to condone the delay of 116 days in filing the Appeal A.S.No. /2023 (A.S.S.R.No. 4982/2023) against both of you and another. The appeal is filed against the decree and judgment dt: 21-10-2022 passed in O.S.No.315/2012 by the Hon'ble Principal Senior Civil Judge, Eluru. As both of you are evaded receiving the notice, the Hon'ble Court has passed order to issue notice through paper publication. The petition stands posted to 05-10-2023. **Both of you have to attend on 05-10-2023 at 10:30 A.M. in the above mentioned Court.** Else, the Hon'ble Court will pass orders in your absence.

(By The Order Of The Court)
Eluru, 17-9-23.
S.SARVESWARA RAO
Advocate, Eluru.